Andhra Jyothy DT 02/03/19.



పనులను పరిశీలిస్తున్న మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, తదితరులు

# వడివడిగా.. హైటెక్ సిటీ కారిడార్

- పెండింగ్ పనులు పూర్తి చేయండి
- మెట్రో ఎండీ ఆదేశాలు
- మధురానగర్.. తరుణీ మెట్రో స్టేషన్

హైదరాబాద్ సిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట-హైటెక్ సిటీ మెట్రో కారిడార్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ సంస్థ ఇంజనీర్లు, ఎల్అండ్‌టీ మెట్రో రైలు ఇంజనీర్లు పెండింగ్ పనులను పూర్తి చేసే పనిలో నిమగ్నమయ్యారు. శుక్రవారం మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి శుక్రవారం ఉన్నతాధికారులతో కలిసి ఎనిమిది మెట్రోస్టేషన్‌లలో పనులను పర్యవేక్షించారు. పది రోజుల్లోగా పెండింగ్ పనులు పూర్తిచేయాలని సూచించారు. బస్‌బేలు, ఆటోలు బేలు, ఎలక్ట్రిక్ వాహనాలు, చార్జింగ్ పాయింట్లను సిద్ధం చేయాలన్నారు. మెట్రో కారిడార్‌లో అభివృద్ధి చేసిన పుట్‌పాత్‌లను ఆక్రమించకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని మెట్రో స్టేషన్‌లలో భద్రతా పరంగా ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాలని సూచించారు.

## తరుణీ మెట్రో స్టేషన్‌గా...

స్టేట్ హోం వద్ద మెట్రో స్టేషన్‌కు మధురానగర్-తురుణీ మెట్రో స్టేషన్‌గా ఏర్పాటు చేశారు. ఈ స్టేషన్‌లో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయనున్నామని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రకటించారు. రెండు ఎకరాల్లో తరుణి మార్కెట్ పేరుతో మహిళలే నిర్వహించేలా వస్తువుల విక్రయ శాలలను ఏర్పాటు చేస్తున్నామని, 40 కార్లు, 400 ద్విచక్ర వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. నుమాయిష్ తరహాలో ఇక్కడ 150 స్టాళ్లను ఏర్పాటు చేసి మహిళలు, పిల్లలకు అవసరమైన వస్తువుల ఉత్పత్తులను విక్రయించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు, దీనికి సంబంధించిన లేఅవుట్‌ను రూపొందించామని తెలిపారు.

## మెట్రో ఎండీ సూచనలు..

- యూసుఫ్‌గూడ మెట్రోస్టేషన్ వద్ద ఉన్న నిర్మాణ సామగ్రిని, కంటెయినర్స్‌ను, ఇతర యంత్రాలను తొలగించాలి. పార్కింగ్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి.
- రోడ్ నం.5 జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న చెత్త చెదారాన్ని పూర్తిగా తొలగించాలని, రోడ్డు మార్గంలో ఉన్న ప్రాంతాన్ని చదును చేసి, మెట్రో సేకరించిన స్థలాల్లో పార్కింగ్ ప్రదేశాలను అభివృద్ధి చేయాలి.
- జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు మెట్రో స్టేషన్‌లో మొదటి అంతస్తులోనే ప్లాట్‌ఫాం ఉండడంతో ఇక్కడ రద్దీ ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. క్యూ మేనేజర్స్‌ను ఏర్పాటు చేసి ప్రయాణికులు సాఫీగా ప్రయాణం చేసేలా చూడాలి.
- మాదాపూర్ మెట్రో స్టేషన్ సమీపంలో నీరూస్ షోరూమ్‌కు వంద మీటర్ల దూరంలో హెచ్ఎంఆర్ సేకరించిన స్థలాన్ని చదును చేసి పార్కింగ్‌కు వీలుగా అభివృద్ధి చేయాలి.
- దుర్గం చెరువు మెట్రో స్టేషన్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఆస్తుల సేకరణ కోసం టౌన్ ప్లానింగ్ అధికారులు అక్కడి స్థల యజమానులతో సంప్రదింపులు జరపాలి. స్టేషన్ చుట్టు అవసరమైన స్థలాలను నిర్ధీత సమయంతో సేకరించి పార్కింగ్, ఇతర అవసరాలకు వినియోగించేలా చేయాలి. ఈ స్టేషన్ నుంచి ఐటీ ఉద్యోగులు రాకపోకలు సాగించేందుకు వీలుగా సంస్థతో సంప్రదింపులు జరిపి ఐటీ ఉద్యోగుల కోసం షటిల్ సర్వీసులు నడిపేలా ఏర్పాట్లు చేయాలి. అన్ని మెట్రో స్టేషన్‌ల వద్ద సూచికల, సమాచారం బోర్డులను ఏర్పాటు చేయాలి.
- హైటెక్ సిటీ మెట్రో స్టేషన్ వద్ద రద్దీ అధికంగా ఉండే నేపథ్యంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలి. ప్రయాణికులకు అర్థమయ్యే విధంగా సూచికల బోర్డులను, పక్కనే ఉన్న ఎల్ అండ్ టీ మాల్‌లో మెట్రో ప్రయాణికుల కోసం పార్కింగ్ ఏర్పాట్లు ఉన్నాయని తెలిసేలా ఏర్పాట్లు చేయాలి.